క్లుప్తంగా

ఆస్పత్రి తనిఖీ



వివరాలను తెలుసుకుంటున్న మున్సిపల్ హెల్త్ ఆఫీసర్

ఆదోని టౌన్: పట్టణంలోని ఎస్కేడీ కాలనీలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సందీప్ తనిఖీ చేశారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై పర్యవేక్షించారు. వ్యర్థపదార్థాలను డస్ట్‌బిన్లలో వేయాలన్నారు. గైనిక్, ఐసీయూ వార్డుల్లోని మరుగుదొడ్లను పరిశీలించారు. ఐసీయూ వార్డులో చికిత్స పొందుతున్న రోగులను పరిశుభ్రతపై అడిగి తెలుసుకున్నారు. రోగులకు అనుగుణంగా పరిసరాల పరిశుభ్రత తప్పకుండా పాటించాలని ఆస్పత్రి నిర్వాహకులకు సూచించారు.

ఉచిత సిలిండర్ సొమ్ము జమ చేయాలి

కోసిగి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు సిలిండర్ల హామీ అమలులో భాగంగా చాలా మంది లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో గ్యాస్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. అయితే ఇందులో తమకు సంబంధం లేదని నిర్వాహకులు జవాబిస్తుండటంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడతున్నారన్నారు.

మహాత్మాగాంధీ నగర్‌లో చోరీ



దుండగులు పగులగొట్టిన బీరువా

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని మహాత్మా నగర్ కా లనీ ప్రభుత్వ పాఠశాల సమీపంలో గురువారం రాత్రి రఘు అనే ప్రముఖ పత్రిక విలేకరి ఇంట్లో చోరీ జరిగింది. పని నిమిత్తం ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కర్నూలుకు వెళ్లారు. ఉదయం తాళాలు పగులగొట్టి ఉన్నాయని స్థానికులు తెలపడంతో వెంటనే శుక్రవారం ఉదయం కర్నూలు నుంచి ఆదోనిలోని ఇంటికి చేరుకున్నారు. దుండగులు ఇల్లు, బీరువా తాళాలను పగులగొట్టి బీరువాలోని నాలుగు గ్రాముల బంగారు ఉంగరం, రెండు వెండి ఉంగరాలు, రూ.11,500 నగదు దొంగలించారని రఘు తెలిపారు. టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

రేపు వాల్మీకి ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు

ఆదోని సెంట్రల్: కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ ప్రాంగణంలో ఈనెల 27వ తేదీ జరగనున్న జిల్లా వాల్మీకి ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు నరసయ్య, లక్ష్మీకాంత్, సత్యన్న, రమేష్‌నాయుడు కోరారు. జిల్లాలోని వాల్మీకి/బోయ ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులందరూ ఆత్మీయ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు సుధాకర్‌బాబు, భీమరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో భవిత కేంద్రం విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ డీఈఓ రాజేంద్రప్రసాద్, ఎంఈఓ-2

ఆదోని సెంట్రల్: రాష్ట్రస్థాయి విభిన్న ప్రతిభావంతుల స్పోర్ట్స్‌లో భాగంగా ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు విజయవాడ తోటపల్లిలో జరిగిన పో టీల్లో ఆదోని భవిత కేంద్రానికి చెందిన ముగ్గురు సీడబ్ల్యూఎస్ పిల్లలు రాణించారని భవిత కేంద్రం సిబ్బంది తెలిపారు. ఇందులో అబుబక్కర్ సిద్ధిక్ సైక్లింగ్ విభాగంలో రెండో స్థానంలో నిలిచాడన్నారు. మనోజ్‌కుమార్ వంద మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానం, అలాగే టి.యశ్వంత్ 50 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానంలో నిలిచారని తెలిపారు. ముగ్గురు చిన్నారులను శుక్రవారం కర్నూలు డిప్యూటీ డీఈఓ జి.రాజేంద్రప్రసాద్, ఎంఈఓ-2 శ్రీనివాసులు అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రం నిర్వాహకులు ఎం.శాంతకుమార్, వి.మౌనిక, సంయుక్త పాల్గొన్నారు.





ఎమ్మిగనూరులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు, ఆదోనిలో మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉగ్రవాదంపై ఉక్కు పిడికిలి

ఉగ్రవాదాన్ని అణిచివేయాలని పలువురు వక్తలు ముక్తకంఠంతో నినదించారు. కశ్మీర్ మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని శుక్రవారం ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతులకు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



కొవ్వొత్తులతో మానవహారం నిర్వహించిన దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: వీహెచ్‌పీ ఆధ్వర్యంలో హిందూ సంఘాలు ఎమ్మిగనూరులో పెద్ద ఎత్తున కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాయి. ఎంజీ పెట్రోల్ బంక్ సమీపంలోని ఓంశాంతి సర్కిల్ నుంచి వైఎస్ఆర్ సర్కిల్ మీదుగా సోమప్ప సర్కిల్ వరకు నిర్వహించిన ర్యాలీలో పట్టణ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పాకిస్తాన్‌కు, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సర్కిల్‌లో పాకిస్తాన్ జెండాలను దహనం చేసి నిరసన తెలిపారు. మృతులకు సంతాపం తెలుపుతూ నివాళులర్పించారు. వీహెచ్‌పీ, బీజేపీ, హిందూ సంఘాల నాయకులు సత్యనారాయణరెడ్డి, దయాసాగర్, నరసింహులు, మధుబాబు, నాగేషప్ప, శివశంకర్ తదితరులు మాట్లాడు తూ అమాయకులను కాల్చిచంపిన ఉగ్రవాదులను మట్టుపెట్టి, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ పట్టణంలో ప్రశాంతంగా ముగిసింది.

యుటీఎఫ్ ఆధ్వర్యంలో..

పహల్గామ్ ఉగ్రదాడికి నిరసనగా యుటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి సోమప్ప సర్కిల్ వద్ద మృతి చెందిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సీపీఎం మండల అధ్యక్షుడు గోవిందు, యూటీఎఫ్ నాయకులు ఎల్లప్ప, కొలన్న, బాబు, నరసింహులు, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల మౌన ప్రదర్శన..

జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చిచంపడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఎమ్మిగనూరులో ముస్లింలు మౌన ప్రదర్శన నిర్వహించారు. హఫీజ్ మసీద్‌లో ప్రార్థనల అనంతరం ముస్లింలు మసీదు వద్ద మౌనప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు యుసుఫ్‌మౌలాన, ఇమ్రాన్ మౌలనా, సయ్యద్ చాంద్, ఫారుక్, అల్తాఫ్, మెకానిక్ బాషా తదితరులు పాల్గొన్నారు.





ఎమ్మిగనూరులో మౌన ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లింలు, నందవరంలో మూతపడిన దుకాణాలు

నందవరం: పహల్గామ్‌లో పర్యాటకులను ఉగ్రవాదుల కాల్చి చంపడాన్ని నిరసిస్తూ నందవరం మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. బంద్‌కు పిలుపునివ్వడంతో దుకాణాదారులు, చిన్న వ్యాపారులు, ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా బంద్‌ను సంపూర్ణం చేశారు. సాయంత్రం విశ్వ హిందూ పరిషత్ జిల్లా ప్రచార ప్రసార ప్రముఖ్ ఉపేంద్రరెడ్డి ఆధ్వర్యంలో మహిళలు, ప్రజలు భారీ ఎత్తున కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ప్రాగంణంలో మానవహారం చేపట్టారు. మృతులకు నివాళులర్పించారు.



ఆదోనిలో స్వచ్ఛందంగా మూతబడిన దుకాణాలు

బంద్ ప్రశాంతం

- ఆదోనిలో స్వచ్ఛందంగా మూతబడిన దుకాణాలు
- మృతులకు కొవ్వొతులతో నివాళి

ఆదోని టౌన్: జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఆదోని పట్టణంలో బంద్ పాటించారు. వ్యాపారులు దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. పెట్రోల్ బంకు యజమానులు సైతం బంద్ పాటించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో సమయానికి బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు కొంత సమయం పాటు బస్టాండులోనే వేచి ఉన్నారు. ప్రధాన రోడ్లు, కూడళ్లలో వ్యాపార దుకాణాలు మూతపడడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనులపై వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో అణిచివేసేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఆదోని అర్బన్: విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో సంతాప శిబిరం ఏర్పాటు చేశారు. పరిషత్ జిల్లా, నగర అధ్యక్షులు ఎ.బసవన్నగౌడ్, ఎస్.ఈరన్నరావు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాలురం పురహిద్, జిల్లా కోశాధికారి కొంగే పంపాపతి, బీజేపీ నాయకులు విట్టా రమేష్ పాల్గొని మాట్లాడారు. హిందూ పర్యాటకులపై పహల్గాంలో ఉగ్రవాదులు దాడి చేసి హేయమైన చర్య అన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో అణిచి వేయాలన్నారు. ఆదోనిలో స్వచ్ఛందంగా షాపులను బంద్ చేసిన వ్యాపారులకు ధన్యవాదాలు తెలిపారు. సభ్యులు చెన్నబసప్ప, కునిగిరి నీలకంఠ, నారాజ్‌గౌడ్, శ్రీనివాస ఆచారి, సాయి, మనోహర్ పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడికి ఖండన

కోసిగి: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ మండల కేంద్రంలో యువకులు, ప్రజలు కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి స్థానిక మార్కండేయ స్వామి ఆలయం నుంచి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్ స్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. దాదాపు అరగంట పాటు నిరసన తెలిపి దాడుల్లో మృతి చెందిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు.



కోసిగిలో...

మలేరియా వ్యాధి నివారణపై ర్యాలీ





ర్యాలీ చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది, కోసిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గోనెగండ్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రజిని ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవంపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిని మాట్లాడుతూ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. రాత్రి పడుకునేటప్పుడు దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఏఎస్ఎంలు, ఆశ వర్కర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కోసిగి: మలేరియా వ్యాధిపై జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి రజిత తెలిపారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆరోగ్యం కేంద్రం నుంచి హెల్త్ సిబ్బంది, ఆశా వర్కర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నిద్రించే సమయంలో దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడుకోవాలన్నారు. సామాజిక ఆరోగ్య అధికారిణి వి.ఈశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు జయమ్మ, రాముడు పాల్గొన్నారు.

ఉగ్రభూత కార్టూన్



ఎమ్మిగనూరు టౌన్: జమ్మూకశ్మీర్ పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల ఘటనను నందవరం మండలం కనకనీడు గ్రామ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు కాకే వెంకటేషప్ప శుక్రవారం కార్టూన్ రూపంలో కళ్లముందుంచారు. మానవత్వం లేని మత చాందస ఉగ్రవాదం అంటూ ఆయన కార్టూన్‌లో వివరించారు.

రీసర్వేలో ఇబ్బందులు తలెత్తనీయొద్దు

పత్తికొండ రూరల్ : భూములు రీసర్వే చేసే సమయంలో రైతులకు ఇబ్బందులు తలెత్తనీయొద్దని ఆర్డీఓ భరత్‌నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక రమ్యరిసార్ట్‌లోని సమావేశ భవనంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్ఓలు, సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వేపై సర్వేయర్లు అందరూ ఖచ్చితమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. అన్ని గ్రామాల్లో రీ సర్వేని పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. నిర్దిష్టమైన కొలతలు, హద్దులు ఏర్పాటు చేసే సమయంలో ఎక్కడైనా సమస్యలు, సందేహాలు తలెత్తితే వెంటనే తహసీల్దార్లు లేదా తమ దృష్టికి తీసుకునిరావాలని సూచించారు.

అనుమతులు లేకుండా ఇసుక తరలించొద్దు

కౌతాళం: మండలంలోని ఇసుక రీచ్‌ల నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఇసుక రీచ్‌ల నిర్వాహకులు, వీఆర్ఏలతో ప్రత్యేక సమావేశం శుక్రవారం సాయంత్రం సీఐ అశోక్‌కుమార్‌తో కలిసి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక కావాల్సిన వారు ముందుగా మీసేవ కేంద్రాల్లో తమ చిరునామతో పాటు వాహనాల నంబర్లను నమోదు చేయించాలన్నారు. ఆ రశీదులను ఇసుక రీచ్‌ల వద్ద చూపించి ఇసుకను తరలించుకోవచ్చని చెప్పారు. ఇసుక రీచ్‌ల వద్దకు వచ్చే వాహనాలను ముందుగా సంబంధిత గ్రామాల వీఆర్ఏలు రశీదులను పరిశీలించి ఇసుక రీచ్‌లలోకి వాహనాలను అనుమతించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే లారీల్లో ఇసుక నింపాలని సూచించారు. ఇసుక రీచ్‌ల వద్ద దళారులకు ఎలాంటి డబ్బులు చెల్లించవద్దు అని తెలిపారు. ఆర్ఐ లక్ష్మన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డి

27 నుంచి ఫ్రెండ్‌షిప్ కప్ క్రికెట్ టోర్నీ

ఆదోని రూరల్: ఈనెల 27వ తేదీ నుంచి స్థానిక మున్సిపల్ క్రీడా మైదానంలో ఫ్రెండ్‌షిప్ కప్-2025 క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్, ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.ఎం.ముజీబ్‌అహ్మద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ టోర్నమెంట్ రాజకీయ పార్టీలు, వ్యాపారులు, హోటల్ మేనేజ్‌మెంట్స్‌కు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో పాల్గొనే వారు రాజకీయ పార్టీకి సంబంధించిన వారైతే కచ్చితంగా రాజకీయ పార్టీ సభ్యత్వ నమోదు కార్డు ఉండాలని, పారిశ్రామిక రంగంలోని వారైతే గుర్తింపు కార్డు ఉన్న వారు అర్హులని చెప్పారు. ఏ రంగానికి చెందిన వారు వారి అసోసియేషన్ లెటర్‌ప్యాడ్‌పై టీంను తమకు సమర్పిస్తే వారికి మాత్రమే ఆట ఆడేందుకు అనుమతినిస్తామని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే వారు డ్రెస్ కోడ్‌తో రావాలన్నారు. అలా రాకపోతే అనుమతి ఉండదన్నారు. ఈనెల 27న టోర్నమెంట్ ప్రారంభమవుతుందని, మే 1వ తేదీ ఫైనల్ మ్యాచ్ ఉంటుందని చెప్పారు. గెలుపొందిన వారికి ట్రోఫీలను అందజేస్తామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

- ఉగ్రదాడి మృతులకు సంతాపం తెలిపిన కౌన్సిల్ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనులను మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యుల సాధారణ సమావేశం చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు అధ్యక్షతన జరిగింది. ముందుగా జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మలకు శాంతి చేకూరాలని సభ సంతాపం తెలుపుతూ కౌన్సిల్ సభ్యులు మౌనం పాటించారు. అనంతరం కౌన్సిల్ అజెండాలోని 32 అంశాలతో పాటు టేబుల్ అజెండాలోని 5 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. టీడీపీ ఫ్లోర్‌లీడర్ దయాసాగర్ మాట్లాడుతూ మున్సిపల్ జనరల్ ఫండ్‌ను స్థానికంగానే వినియోగించుకోనేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని అధికారం కమిషనర్‌కు ఉన్నందున ప్రస్తుతం జనరల్ ఫండ్‌లో మిగిలిన రూ.12 కోట్ల నిధులను పట్టణాభివృద్ధికి ఉపయోగించాలని సూచించారు. పట్టణంలోని పలు ప్రభుత్వ శాఖల ద్వారా రావాల్సిన ఆస్తి పన్నులను రాబట్టుకోవాల్సిన అవసరం ఉందని వాటికి సంబంధించిన నిధులు వసూలైతే పట్టణాభివృద్ధికి ఎంతో ఉపయోగం వుంటుందన్నారు. కాగా కుర్ణి శ్మశాన వాటికకు ప్రహరీ, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని తన వార్డులో అభివృద్ధి పనులు చేపట్టాలని కౌన్సిలర్ ఎంకే శివప్రసాద్ సభ దృష్టికి తెచ్చారు. గాంధీనగర్‌లో రోడ్డు నిర్మాణ తాగు నీటి సమస్య ఉందని కౌన్సిలర్ డిష్ కేశవరెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. 2వ వార్డులో సీసీ రోడ్డు నిర్మించాలని పలుమార్లు సభ దృష్టికి తెచ్చినా ఫలితం లేదని వార్డు కౌన్సిలర్ అంపమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా సమస్యలపై స్పందించిన కమిషనర్ గంగిరెడ్డి మాట్లాడుతూ సభ్యులు చెప్పిన ఆయా అభివృద్ధి పనులను చెపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, మున్సిపల్ మేనేజర్ వరప్రసాద్, టీపీఓ రాజేష్, డీఈ నీరజ, ఏఈలు శరత్‌చంద్ర, మదన్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

7న బండలాగుడు పోటీలు

కృష్ణగిరి: మండలంలోని అమకతాడులో వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాల సందర్భంగా మే నెల 7వ తేదీన ఆరు పళ్ల విభాగం ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు దాతల సహకారంతో రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5 వేలు, రూ.3వేలను అందించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఆదే రోజు ఉదయం 7 గంటల లోపు రూ. 500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ 93902 36459, 7013564624 సంప్రదించాలన్నారు.

వెల్దుర్తి: హైవే - 44పై అల్లుగుండు స్టేజి వద్ద శుక్రవారం రాత్రి నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న కోడుమూరు మండలం అమడగుంట్లకు చెందిన సుంకన్నను డోన్‌వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లి పోయింది. మల్లెపల్లె సుంకులమ్మ అమ్మవారిని చేస్తున్న బంధువుల కార్యక్రమానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో సుంకన్న కాలు విరిగింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బిలేహాల్‌లో గడ్డివాముల దగ్ధం

హాలహర్వి: మండలంలోని బిలేహాల్ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం గొల్ల లింగమయ్య, బోయ రామలింగయ్యకు చెందిన గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గడ్డివాములు తగలబడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఆలూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం చేరవేశారు. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేసే ప్రయత్నం చేసినా అప్పటికే గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. లింగమయ్యకు చెందిన మూడు గడ్డివాములు, బోయ రామలింగయ్యకు చెందిన రెండు గడ్డివాములు మొత్తం ఐదు గడ్డివాములు కాలి బూడిదయ్యాయన్నారు. ప్రమాదంలో దాదాపు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

హాలహర్వి: నిట్రవట్టి గ్రామానికి చెందిన భరత్ బళ్లారికి వెళ్లి పని ముగించుకుని శుక్రవారం రాత్రి వస్తుండగా బీడీ ట్రక్కు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అటుగా వెళ్తున్న వారు 108 వాహనంలో హాలహర్వి ఆసుపత్రికి తరలించారు. తలకు గాయాలు కావడంతో బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య

హాలహర్వి: మండలంలోని అమృతాపురం గ్రామంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు.. కమ్మ పెద్ద వెంకటేష్(55) శుక్రవారం ఉదయం బర్రెలను మేపేందుకు పొలానికి తోలుకుని వెళ్లాడు. సాయంత్రం 6 గంటలైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలాల్లోకి వెళ్లి చూడగా.. వరిపైరులో నిర్జీవంగా కనిపించాడు. ఒంటిపై రక్తపు మరకలు, గాయాలు ఉండటంతో హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. పెద్ద వెంకటేష్ గ్రామంలో చాలా మందికి అప్పులు ఇచ్చాడు. అప్పు తీర్చే విషయంపై ఎవరు హత్య చేశారో తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, హాలహర్వి ఎస్ఐ చంద్ర ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. మృతుడికి భార్య సరోజమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.





రక్త గాయాలతో మృతి చెందిన పెద్ద వెంకటేష్, కమ్మ పెద్ద వెంకటేష్ (ఫైల్)

విద్యార్థినికి సన్మానం

ఆదోని రూరల్: ఆలూరు నియోజకవర్గం దేవనకొండకు చెందిన సలీమా అనే విద్యార్థిని ఆదోనిలోని ఓ పాఠశాలలో చదివి పది ఫలితాల్లో 597 మార్కులు సాధించడం హర్షణీయమని దూదేకుల సంఘం నాయకులు పి.సాయిబాబు, షేక్‌షావలి, బదినేహాల్ మాబుసా అన్నారు. శుక్రవారం విద్యార్థినిని అభినందించారు. చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సాధ్యమని.. బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. విద్యార్థిని మాట్లాడుతూ.. తన విజయం వెనుక తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఉందన్నారు.



సలీమాను అభినందిస్తున్న సంఘం నాయకులు

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్ట్

దేవనకొండ: మండలంలోని కుంకనూరు గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న రామంజిని అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పత్తికొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరావు, ఎస్ఐ రాజేష్ శుక్రవారం రాత్రి తెలిపారు. నిందితుడి నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.